# గాంధీ పుట్టిన దేశం

గుప్తుల కాలం స్వర్ణయుగం అనీ, ఆ రోజుల్లో రత్నాలు రాసులు పోసి అమ్మేవారని మనం చరిత్రలో చదువుకుంటున్నాం. అలాగే పూర్వం మన నాయకులు స్వాతంత్ర్య ఉద్యమంలో శాంతిసత్యాగ్రహాలతో బ్రిటిష్ వారిపై యుద్ధంచేసి స్వాతంత్ర్యం సముపార్జించారని ఈనాటికి ఘనంగా చెప్పుకుంటున్నాం. కుక్క గొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రతీ రాజకీయ పార్టీ నాయకుడూ "మహాత్మా గాంధీ సిద్ధాంతాలు మావే" అంటాడు. పాపం ఆ మహానుభావుడు ఎక్కడున్నాడో నీతి, నిజాయితీ లేని వీళ్ళందరూ ఒక్కోసారి తలచుకున్నప్పుడల్లా ఓ కన్నీటి చుక్క రాల్చకమానడు.

ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే స్వాతంత్ర్య దినోత్సవం వచ్చింది మళ్ళీ.

మా కంపెనీలో పెద్ద జెండా కుట్టించాము. పెద్ద జెండా ఎందుకంటె చిన్న జెండా అయితే క్రింద వున్నప్పుడు కొద్దిగా కనపడినా, పైకి ఎగిరాక అసలు కనపడదు. అదే పెద్ద జెండా అయితే క్రిందవున్నప్పుడు పట్టు కోవడానికి అలవి కాకపోయినా పైకి వెళ్ళాక ఎగురుతూ చాలా గ్రాండ్‌గా కనిపిస్తుంది పైగా మా కంపెనీ డైరక్టర్‌గారు మన కంపెనీ చిన్నదయినా మనకు జెండా పెద్దది వుండాలి, పెద్దజెండా మన కంపెనీ యొక్క బ్రాడ్ వ్యూస్‌కి చిహ్నంగా వుంటుంది అంటారు.

సరే ఎల్లుండి స్వాతంత్ర్య దినోత్సవం. మీటరు పొడుగు వున్న జెండా ఉతకడానికి లాండ్రీకి ఇచ్చాము. మేము అందరం తినడానికి క్లాస్ చాక్లెట్స్, అందరికి పంచడానికి చౌకబారు స్వీట్స్ కొన్నాము (ఇక్కడ మాత్రం బ్రాడ్ వ్యూ అని అడగవద్దు).

కంపెనీ ముందు గ్రౌండ్ అంతా శుభ్రం చేయించి ఒక్క గడ్డిపరక గూడా లేకుండా చేయించాము.

ఇంతలో మర్నాడు లాండ్రీకి జెండా తీసుకురావడానికి మనిషి వెళ్ళిన జెండాఆరేస్తే ఎవరోఎత్తుకుపోయారని వార్తపట్టుకొచ్చాడు.కొంపమునిగింది.

మా కంపెనీ డైరక్టరుగారు చండశాసనుడు. ఆయనకు ఈ విషయం తెలిసిందంటే, ఇప్పుడు జెండా గుడ్డనే కాపాడలేని వాళ్ళు కంపెనీ యొక్క భద్రత ఏం చూస్తారయ్యా అని మొత్తం సిబ్బందినే నిలబెట్టి రెండు గంటలు క్లాస్ తీసుకుంటారు. ఆయన చేత సుత్తి దాచేయించడం మావల్ల కాదు. ఈ దుర్భర వ్యథ అనుభవించలేక మరో జెండా తయారు చేయించాం.

'నేడే స్వాతంత్ర్యదినం' అని మైక్‌లో పాటలు వస్తున్నాయి.

మాకు పతాక వందనం ఉదయం 7.40 సిబ్బంది తమ తమ పిల్లలతో సహా తయారై వచ్చారు. సిబ్బంది కన్నా పిల్లలు ఎక్కువ మంది వున్నారు.

మా కంపెనీ డైరక్టర్‌గారు వచ్చారు. కొద్ది క్షణాల్లో జెండా ఎగుర వేయకుండా ఎటో చూస్తున్నారు.

మా సిబ్బంది మొత్తానికి గుండె గుభేలుమంది. ఒకవేళ ఎక్కడయినా అశుభ్రంగా వుందేమో ఆయన సుత్తి బయటకు తీస్తే—

"మిస్టర్ సుబ్బారావ్" ఏం.డిగార్ని పిలిచారు.

"యస్.సర్."

"సీ దేర్" అని చూపుడు వేలుతో చూపిస్తున్నారాయన"

మా కంపెనీ గేటు దగ్గర

కాషాయరంగు గౌను

ఆకుపచ్చరంగు లాగూ చొక్కా

తెలుపు గౌను. వేసుకున్న ముగ్గురు చిన్నపిల్లలు—

వాళ్ళు మా కంపెనీ ప్రక్కనే వున్న గుడిసెల్లో వుండే పిల్లలు అయివుంటారు.

"ఏమిటి సార్."

"ఏమిటయ్యా నీకు కనపడటం లేదా? నిన్న మన జెండా పోయిందట, మీరు ఎవరూ చెప్పకపోయినా నాకు తెలుసు. ఆ పిల్లలు వేసుకున్న గుడ్డ మన జెండానే, వాళ్ళను ఇటు తీసుకురమ్మను. గర్జించారాయన.

గుర్ఖా వెళ్ళి వాళ్ళని తీసుకువచ్చాడు.

ముగ్గురికీ బిళ్ళలు పెట్టారాయన.

"మీ నాన్న ఎవరు?"

"మా నాన్న రిచ్చా లాగుతాడు"

"ఈ గుడ్డ ఎక్కడిది మీకు?"

"—" "చెప్పమాకే అని ఆకుపచ్చరంగు కుర్రాడు నెమ్మదిగా అంటున్నాడు.

"చెప్పరేం?"

"నిన్న మా నాన్నకు దొరికినాదండి"

"మిష్టర్ సుబ్బారావ్, రింగ్ అప్‌టు పోలిస్‌స్టేషన్.

దానికి ఎం.డి సుబ్బారావుగారూ

"ఎక్స్‌క్యూజ్ మి సర్"

"వ్వాట్?"

"పోలీసులు ఎందుకు సర్."

"ఎందుకా, జాతీయజెండాని అవమానించినందుకు వాళ్ళు శిక్షార్హులు. నీకు తెలియదా? మీకు దేశభక్తి లేదయ్యా. దేశభక్తి అంటే వెనకటికి మేము—"ఆయన సుత్తి తీశాడు—

"కాని—"

"ఏమిటి చెప్పు"

"మహాత్మాగాంధీ కాని, మరేనాయకుడు గాని, ఎవరైనాసరే కడుపు నిండా తిండీ, వంటి నిండా బట్టా వుండాలని కోరుకున్నారు.

"అయితే—"

"మన జెండా ముగ్గురు పిల్లలకు వళ్ళు దాచుకోవడానికి అవకాశం ఇచ్చింది. వాళ్ళముఖాల్లో వున్న ఆనందం చూడండి. నిన్న మొన్నటి వరకూ దిసి మొలలుతో తిరిగేవారు. తెలియక చేసిన తప్పుకు వాళ్ళకి శిక్ష వద్దు సర్.

"యస్. లెట్ దెమ్ గో.." అని చక చకా జెండా ఎగురవేశారాయన—

జెండా ఊంఛా రహే హమారా—

—★—